క్లుప్తంగా

నమో శివరుద్రాయ



ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

రోగులకు పండ్ల పంపిణీ

పరవాడ: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పరవాడలో కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఆర్ఆర్ నాయుడు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు, పేదలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు ఐ.ఆర్.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

చీమలాపల్లిలో ఆక్రమణ తొలగింపు

- వీఆర్వోకు షోకాజ్ నోటీస్



అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

సింహాచలం: జీవీఎంసీ 95వార్డు చీమలాపల్లిలో సోమవారం రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. సర్వేనెంబరు 8లో గెడ్డ వాగు స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణం జరుగుతున్న విషయంపై ఆర్డీవోకు పలువురు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన సమగ్ర పరిశీలన చేశారు. అక్రమ నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోకుండా విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వీఆర్వో వరలక్ష్మికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. అలాగే భవనం తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ఆర్ఐ సాయి ఆధ్వర్యంలో తొలగింపు పనులు చేపట్టారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీవిద్యా ట్రస్టు ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలకు గోమాత సేవ,కలశ స్థాపనతో అంకురార్పణ చేశారు. లలితా మహా త్రిపురసుందరి సర్వలోకాలను రక్షించే వారాహి మాతను ప్రసన్నం చేసుకోవడానికి ఈ వారాహి నవరాత్రి ఉత్సవాలు ఏటా నిర్వహిస్తున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు.

బ్యాటరీ వాహనం వితరణ ..దేవీపురం ప్రాంగణంలో వృద్ధులు, దివ్యాంగులు తిరిగే విధంగా హైదరాబాద్‌కు చెందిన పోరష్ అగ్రో ప్రాడక్ట్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నామాల పురుషోత్తమరావు, డైరెక్టర్ అనంతలక్ష్మితో కలిసి బ్యాటరీ వాహనం అందజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1 పరిధిలోని 11కేవీ, 11కేవీ సబ్బవరం రూరల్ ఫీడర్లలో లైన్ల నిర్వహణ, మరమ్మతులు చేపట్టనున్న దృష్ట్యా బుధవారం ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ డీ1 సెక్షన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అడ్మిషన్లకు దరఖాస్తులు

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 – 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నామని యూనివర్సిటీ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్. ఎల్.విజయకృష్ణారెడ్డి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్‌లో అడ్మిషన్ల కోసం www. braouonline. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనధికార పార్కింగ్‌తో కష్టాలు!

- వాహనాలు తప్పించే క్రమంలో ట్రాఫిక్ జామ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఊటగెడ్డ కూడలిలో వాహనాలు తప్పించే క్రమంలో నిలిచిపోయిన ట్రాఫిక్

పరవాడ: రోడ్లపై ఎక్కడికక్కడ భారీ వాహనాలు ఇష్టానుసారం నిలిపేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్లు కావడంతో వాహనాలను తప్పించే క్రమంలో ఎదురుగా వాహనాలు రావడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో నిర్ణీత సమయానికి గమ్యానికి చేరుకోలేక ప్రయాణికులు సతమతమవుతున్నారు. లంకెలపాలెం-పరవాడ, పరవాడ-ఎన్టీపీసీ, పరవాడ-అచ్యుతాపురం రహదారులో తరచూ ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఈ మార్గాల్లో ప్రయాణమంటేనే ప్రజలు విసిగిపోతున్నారు.

నిత్యం ఇదే తంతు

హిందూజా పరిశ్రమకు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. లంకెలపాలెం కూడలి, రాంకీ కూడలి, మండల కాంప్లెక్సు కూడలి, సినిమాహాలు జంక్షన్, ఊటగెడ్డ కూడలి ప్రదేశాల్లో నిత్యం భారీ వాహనాలను సిబ్బంది టీ, భోజన హోటళ్లకు వెళ్లడానికి లారీలను రోడ్డుపై నిలుపుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు ఆపై భారీ వాహనాలను నిలపడం వల్ల మరో భారీ వాహనం వస్తే తప్పించుకోవడం గగనమవుతోంది. సింగిల్ రోడ్లపై భారీ వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, పట్టణ ప్రాంతాల్లో చదువు కొనే విద్యార్థులు, ద్విచక్ర వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. మరో వైపు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పోలీసుల చర్యలు నిల్

అనధికార పార్కింగ్ చేస్తున్న వాహన సిబ్బందిపై పోలీసులు కనీస చర్యలు చేపట్టక పోవడం వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఎక్కడిపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యారంగానికి సర్కారు పెద్దపీట



పాపయ్యరాజుపాలెంలో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని, ప్రతీ విద్యార్థి ఉన్నతస్థితికి చేరుకోవాలన్నదే ఆయన ఆకాంక్ష అని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం, గొల్లవిల్లిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం జగననన్న విద్యా కానుక కిట్లను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముమ్మన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ప్రతీ చిన్నారి చదువుకోవాలన్న లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు ఉండాలన్న ధ్యేయంతో నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.టి.మూర్తి, లక్ష్మి, ఉపాధ్యాయులు, నాయకులు చినబాబు, నూకరాజు, చెల్లారావు, లక్ష్మి పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలనకు సహకరించాలి

- ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్



పలు పార్టీల నాయకులతో మాట్లాడుతున్న హుస్సేన్ సాహెబ్

సింహాచలం: జూలై 21నుంచి ఆగస్టు 21వరకు నెలరోజుల పాటు జరిగే ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ కోరారు. ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమానికి సంబంధించి పలు రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం ఆర్డీవో సమావేశం నిర్వహించారు. నెలరోజులపాటు జరిగే కార్యక్రమాన్ని పార్టీల నాయకులు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని సహకరించాలని కోరారు. బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు నక్క కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

బోదువలస సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల , సబ్ రిజిస్ట్రార్ రత్నకుమార్

సబ్బవరం: మండలంలోని బోదువలస సచివాలయంలో మొదటిసారిగా భూముల రిజిస్ట్రేషన్ సేవలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా భూముల సమగ్ర రీ సర్వే నిర్వహించి భూ రక్ష పథకం ద్వారా రైతులకు ఉచితంగా పట్టాలు అందజేస్తున్నారన్నారు. వెంటనే ఆ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ లావాదేవీలు కూడా రైతులకు అందుబాటులో ఉండే విధంగా సచివాలయాల్లో నిర్వహించడం అభినందనీయమన్నారు.స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సహకారంతో మండలంలోని అయ్యన్నపాలెంలో రీ సర్వే చేసిన వెంటనే తొలి రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ఎంవీ రత్నకుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎ. శ్రీనివాసరావు,పంచాయతీ కార్యదర్శి సీహెచ్ పవన్ కుమార్, సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు,ఉగ్గిన నాయుడు,ఉగ్గిన రాము,మాజీ సర్పంచ్‌లు బుదిరెడ్ల రామకృష్ణ, కోన సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

పరవాడ ఎంఈవోగా సాయి శైలజ



సాయి శైలజ

పరవాడ: మండల విద్యాశాఖ అధికారిగా సాయి శైలజను జిల్లా విద్యాశాఖ అధికారులు నియమించారు. ఈమె నర్సీపట్నం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. పరవాడ ఎంఈవో ఎం. సునీతను గాజువాక మండల విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ కేవైసీ.. ఇక సులభం

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే ఆర్థిక సాయానికి ఈకేవైసీ తప్పనిసరి. ఈకేవైసీ చేయకుంటే తమ బ్యాంకు ఖాతాలకు నగదు జమ కాదు. చాలా మంది రైతులు వివిధ కారణాలతో దీన్ని పూర్తి చేయట్లేదు. ఇలాంటి వారి కోసం తమ ఇళ్ల వద్దే ఈకేవైసీ చేయించుకునేందుకు వీలుగా కిసాన్ యాప్ అందుబాటులోకి వచ్చింది. దీంతో శతశాతం రైతులు ఈకేవైసీ నమోదుకు వీలవనుంది.



రేబాకలో ఈకేవైసీ చేయిస్తున్న అధికారులు

- అందుబాటులోకి కిసాన్ యాప్
- నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశాలు
- ఇప్పటివరకు సబ్ డివిజన్‌లో 85శాతం పూర్తి

అనకాపల్లి రూరల్ : రైతు భరోసా సాయం అందాలన్నా, పీఎం కిసాన్ సొమ్ము బ్యాంక్ ఖాతాకు జమ కావాలన్నా ఈకేవైసీ నమోదు తప్పనిసరి. దీంతో ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ-పంట నమోదు చేసుకున్నా, ఈకేవైసీ పూర్తికాక ఏటా సుమారు 15-20 శాతం మంది రైతులు ఆర్థిక లబ్ధిని పొందలేకపోతున్నారు. ఈకేవైసీపై అవగాహన లేమి, రైతులు సమయానికి అందుబాటులో లేకపోవడమే దీనికి కారణమని అధికారులు చెప్తున్నారు. ఈకేవైసీలో రైతుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై రైతులు ఈకేవైసీ కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పనిలేదు. స్మార్ట్ ఫోన్ సాయంతో తమ ఇంటి వద్దే దీన్ని పూర్తి చేసుకోవచ్చు.

డివిజన్‌లో 85 శాతం పూర్తి

అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో మొత్తం 41,085 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి. ఇప్పటివరకూ 35,058 మంది రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. ఇంకా 6,027 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. వీరందరికీ పీఎం కిసాన్ యాప్ ద్వారా ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 100 శాతం ఈకేవైసీ పూర్తి చేసేందుకు కిసాన్ యాప్ ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉండడం, నమోదు సులభతరం కావడంతో ఈ సారి రైతులందరితో ఈ కేవైసీ పూర్తి చేయించి, వీలైనంత ఎక్కువమంది రైతులు ప్రభుత్వ సాయం పొందేలా అధికారులు కృషి చేస్తున్నారు. వారం రోజులుగా ఈకేవైసీ తక్కువగా నమోదైన గ్రామాల్లో అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతూ కిసాన్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఇబ్బందులకు చెక్

ప్రారంభంలో వ్యవసాయ గ్రామ సహాయకులు అందుబాటులో ఉన్న రైతుల వేలి ముద్రలు తీసుకుని ప్రక్రియ పూర్తి చేసేవారు. మిగిలిన వారిని ఫోన్ ద్వారా సంప్రదించి, వారికి వచ్చిన ఓటీపీ ద్వారా నమోదు చేశారు. కొంత మంది రైతులు ఓటీపీ చెప్పేందుకు నిరాకరించడం, భూ యజమానులు మరణించడం, భూమి పూర్తి వివరాలు ఆన్‌లైన్ కాకపోవడం, మ్యుటేషన్ చేయించకపోవడం వంటి సాంకేతిక కారణాలతో ఈకేవైసీ పూర్తి కావడంలేదని అధికారులు అంటున్నారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు ఈ సారి పీఎం కిసాన్ మొత్తం జమ కాదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు స్పందించి వీలైనంత త్వరగా ఈ కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

స్మార్ట్ ఫోన్ ద్వారా ఇలా..

ఈక్రాప్, ఈకేవైసీ ముఖ ఆధారిత విధానంలో నమోదు ప్రక్రియ ఎవరికి వారే పూర్తి చేసుకోవచ్చు. ముందుగా స్మార్ట్‌ఫోన్ లోని ప్లేస్టోర్‌లోకి వెళ్లి పీఎం కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. కిసాన్ యాప్‌లో ఆధార్ సంఖ్య నమోదు చేయగానే పీఎం కిసాన్ దరఖాస్తులో నమోదు చేసిన చరవాణి నంబరుకు ఓటీపీ వస్తుంది. దీనికి ఆధార్ లింక్‌తో సంబంధం ఉండదు. ఓటీపీ నమోదు చేయగానే ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్నట్టుగా కనిపిస్తుంది. ఫోన్‌లోని ముందు కెమెరా ఎదుట కళ్లు కదిలిస్తే యాప్‌లో ఓకే అని వస్తుంది. దీంతో ఈకేవైసీ ప్రక్రియ పూర్తయినట్టుగా పూర్తి వివరాలు వస్తాయి.

అనకాపల్లి సబ్ డివిజన్‌లో ఈకేవైసీ వివరాలు ఇలా..

మండలం	రైతులు	ఈకేవైసీ పూర్తి	పెండింగ్ రైతులు
అనకాపల్లి	11,718	9,999	1,719
కశింకోట	7,470	6,650	820
మునగపాక	7,790	6,711	1,079
సబ్బవరం	9,314	7,450	1,864
పరవాడ	4,793	4,248	545

ఎక్కడి నుంచైనా ఈకేవైసీ



రైతులు ఈకేవైసీని నమోదు ఎక్కడి నుంచైనా పూర్తి చేసుకోవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానంలో మా సిబ్బంది ప్రస్తుతం చాలా మందికి ఈకేవైసీ పూర్తి చేస్తున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలి.

– వీయూబీపీ రంగాచారి, ఇన్‌చార్జి ఏడీఏ, అనకాపల్లి

శారదాపీఠాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న రోహిత్‌రెడ్డి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠాన్ని తెలంగాణ రాష్ట్రంలోని తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి సోమవారం సందర్శించారు. రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. వచ్చేనెల 3న తాండూరులో నిర్వహించనున్న రాజశ్యామల యాగం నిర్విఘ్నంగా సాగేలా ఆశీస్సులు అందజేయాలని స్వామీజీని కోరారు. అలాగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కూడా ఎమ్మెల్యే కెప్టెన్ రోహిత్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు.

గ్రామ కంఠం స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



గ్రామ కంఠం స్థలం ఆక్రమించి వేసిన బిల్డింగ్ మెటీరియల్

సబ్బవరం: మండలంలోని బాటజంగాలపాలెంలోని గ్రామ కంఠం స్థలం ఆక్రమణపై సర్పంచ్ పడాల వెంకట రమణ సోమవారం తహసీల్దార్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఓ మహిళ తన ఇంటిని అనుకుని ఉన్న గ్రామ కంఠం స్థలం ఆక్రమించి బిల్డింగ్ మెటీరియల్ వేయడంతో సతకంపట్టు వద్ద గ్రామస్తులు తిరగడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామంలో అమ్మవారిని ఊరేగించేందుకు చోటు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని గ్రామ కంఠం స్థలాన్ని ఖాళీ చేయించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు కల్యాణం నిర్వహించారు.

పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలి

- స్థానికుల ఆందోళన
- పరిహారం చెల్లించిన చోటే పనులు చేస్తున్నాం : ఏసీపీ జయరాం



ఏసీపీ జయరాంతో మాట్లాడుతున్న పలు పార్టీల నాయకులు, బాధితులు

సింహాచలం: పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించిన తర్వాతే బీఆర్‌టీఎస్ పనులు ప్రారంభించాలని సోమవారం పలువురు నిర్వాసితులు, పలు పార్టీల నాయకులు అడవివరంలోని పాత గోశాల జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. పాత గోశాల జంక్షన్-పాత అడవివరం కూడలి మార్గంలో బీఆర్‌టీఎస్ పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాని విషయం తెలిసిందే. అయితే రోడ్డు విస్తరణ నిమిత్తం పాత గోశాల జంక్షన్ నుంచి తొలిపావంచా వరకు ఉన్న నిర్వాసితులకు గతంలోనే రెండు టీడీఆర్‌లు ఇచ్చి నష్టపరిహారం చెల్లించారు. ఇంకా తొలిపావంచా నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు నష్టపరిహారం ప్యాకేజీ తేలాల్సి ఉంది. ఇటీవల జీవీఎంసీ,రెవెన్యూ, ప్రజా ప్రతినిధులు రోడ్డు విస్తరణ పనులు యుద్ధప్రాతిపదికన చేయాలని భావించారు. ఈతరుణంలోనే తొలిపావంచా నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు నివసించే బాధితులతో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. పాత గోశాల జంక్షన్ నుంచి తొలిపావంచా వరకు ఉన్న బాధితులు కూడా తమకు ప్రత్యామ్నాయ స్థలం ఇప్పటి వరకు ఇవ్వలేదని, అప్పట్లో రెండు టీడీఆర్‌లే ఇచ్చారని, మరో రెండు టీడీఆర్‌లు ఇవ్వాలని కోరారు. దానిపై ఎలాంటి నిర్ణయం లేకుండా సోమవారం పాత గోశాల వద్ద జీవీఎంసీ అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో బాధితులు, పలు పార్టీల నాయకులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్య నుంచి రెండువైపులా సమానంగా విస్తరణ జరగాలని, రెండు లైన్లగానే రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితులకు నాలుగు టీడీఆర్‌లు ఇవ్వాలని, ప్రస్తుత మార్కెట్ వాల్యూ ప్రకారం బిల్డింగ్ నష్టపరిహారం ఇవ్వాలని, మిగిలిన స్థలంలో మళ్లీ నిర్మాణం చేసుకునే వీలు కల్పించాలన్నారు. ఖాళీ స్థలాలకు కూడా వేరేచోట స్థలం ఇవ్వాలని నినదించారు. ఏసీపీ జయరాంతో వాగ్వాదానికి దిగారు. ఏసీపీ విలేకర్లతో మాట్లాడుతూ పాత గోశాల జంక్షన్ నుంచి తొలిపావంచా వరకు బాధితులకు నష్టపరిహారంతో పాటు టీడీఆర్‌లు కూడా అందజేశామన్నారు. ఆ ప్రదేశంలో మాత్రమే విస్తరణ పనులు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈ మార్గంలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తామని, వర్షపు నీరు రోడ్డుపైకి రాకుండా ట్రించ్‌లు కొడతామని చెప్పారు. నిరసన తెలిపిన వారిలో పలు పార్టీల నేతలు ఎర్ర వరహానరసింహం, సతివాడ శంకరరావు, బాధితులు గంట్ల కిరణ్ బాబు, అక్కిరెడ్డి అప్పారావు తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు 18 మేకల మృతి



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ పరిధి రావలమ్మపాలెం గ్రామంలో 18 మేకలు పిడుగు పాటుకు మృతి చెందాయి. బీసీ హాస్టల్ పక్కన ఉన్న సద్ది రమణ అనే వ్యక్తికి చెందిన పాకపై సోమవారం వేకువజామున పిడుగు పడింది. పాకలో ఉన్న 25 మేకల్లో 18 అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన మేకలు స్పృహతప్పి కొన ఊపిరితో ఉన్నాయి. వీటి విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. సద్ది రమణ స్వగ్రామం కోటపాడు మండలంలోని గుల్లేపల్లి కాగా.. భార్య, ఇద్దరు ఆడపిల్లలతో పది సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నారు. మృతి చెందిన మేకలను సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తితో పాటు వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ తదితరులు పరిశీలించారు. వీఆర్వో మూర్తితో పాటు వెటర్నరీ సిబ్బంది మృతి చెందిన మేకలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు భర్లికాన సాయినాథరావు సంఘ సభ్యులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

చెరువును పరిశీలించిన పీసీబీ అధికారులు

పరవాడ: తానాం సమీపంలో రాంకీ యాజమాన్యం జరుపుతున్న చెరువు తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నాగేంద్రరెడ్డి చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్న చెరువును పూడ్చివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ స్పందనలో ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు పీసీబీ అధికారులు సోమవారం తానాం సమీపంలో తవ్వకాలు జరుపుతున్న చెరువును పరిశీలించారు. ఫార్మా పరిశ్రమల విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనాలు కాలువల్లో కలుస్తున్నాయని గుర్తించామన్నారు. పది రోజుల్లో రాంకీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. సమస్యపై పూర్తిగా అధ్యయనం చేసి చర్యలు చేపడతామని ఈఈ నాగేంద్రరెడ్డి పేర్కొన్నారు.